## 2

కొంత దూరంలో రోడ్డు మీద గుమిగూడివున్న జనాన్ని చూసి, రోడ్డు మలుపు తిరగకుండా తిన్నంగా గుంపు వైపు నడిచాను నేను.

శుక్లపక్షపు రోజులవి. అంతవరకు తన తల్లి ఐన ప్రపంచానికి లేలేత వెన్నెలని అందించిన పంచమి చంద్రుడు, తుది శ్వాస విడిచి ఆకాశాన నిర్జీవంగా పడి వున్నాడు.

రోడ్డు చీకటిగా వుంది గుంపులో వున్నవారి ముఖాలు అస్సలు కనబడలేదు. కాని ఒక పాతిక ముప్పది మంది వుంటారని అనిపించింది.

"ఏమైందిరా...." దగ్గరకు వెళ్లేకొద్దీ గుంపులోని జనాల మాటలు వినబడ్డాయి. ఒక ఆమె సన్నటి ఏడుపు కూడా వినిపించింది.

"బొట్టు కునుకేసిందిరా...."

"జ్వరం కాని వచ్చినాదా ఏమిటి...."

"తెలవదురా, తిండి కక్కేసినాదటరా. ఓ నాలుగు సార్లు కొండకెళ్లి వచ్చినాదట."

"మరి డాక్టర్ బాబు.... ఏదో చెప్పబోయే అతను నన్నుచూసి ఆగిపోయాడు. దారి ఇవ్వండిరా. అమ్మగోరు వచ్చినారు."

గుంపులో వున్నవారు సాదరంగా జరిగి దారి ఇచ్చారు. వారంతా మా ఇంటి వెనుక వున్న కొండవారగా వుండి కూలి చేసి బ్రతికేవారే!

నేను ముందుకు అడుగులు వేసాను. ఎదురుగా పాకముందు కాలు జాపుకుని కూర్చొని వుంది ఒక ఆమె - ఆమె ఒళ్లో ఒక పాప - పాకలో ఒక గుడ్డి దీపం.

ఆరిపోయే గుడ్డి దీపం వెలుగులో దూరం నుంచి ఆమెను పోల్చుకోలేకపోయాను, నేను దగ్గరకు వెళ్లగానే నా గుండె

గతుక్కుమంది. ఆమె మా ఇంటిలో పనిచేసే రామాయమ్మే!

"అమ్మగోరు...." నన్ను చూసిన రామాయమ్మ, బోరుమంది.

"నా బొట్టు.... నా బొట్టు.... నాకు...."

నా కళ్ళు నిండాయి. కర్చీవుతో కళ్ళు వొత్తుకున్నాను. రామాయమ్మ ఒళ్ళో పడుకొని ప్రశాంతంగా నిద్రపోతున్నట్టు ఉంది పాప!

ఒక రెండు నెలల క్రితం వరకు సత్తిగిన్నె పుచ్చుకొని రామాయమ్మ వెనుక వచ్చేది, ఆ పాప.

చాలా చలాకీగాను, అందంగాను కనబడిన ఆ పాపను చూసి నేను ముచ్చట పడేదాన్ని.

"పాపని బడిలో వెయ్యక నీ వెనక తిప్పుకుంటున్నావేమిటి? ఒకరోజు రామాయమ్మని అడిగాను. "ఎనిమిదేళ్ళు వచ్చిందన్నావుగా."

"నిజమేనమ్మా" రామాయమ్మ అంది. "బడిలో వేసానమ్మగోరు."

"మరి...."

"అది బడికెళ్ళటం-లేదమ్మా."

"అలాగంటే ఎలాగా, రామాయమ్మ. నయాన్నో భయాన్నో పంపాలి." రామాయమ్మ మౌనంగా ఉండిపోయింది.

"పిల్లని పనిలోకి కాదు, బడిలోకి పంపాలని చెప్తున్నారు కదమ్మా" నేను మళ్ళీ అన్నాను.

"నిజవేనండి అమ్మగోరు. వెళ్ళనని మొండికేస్తే ఏం చేస్తామమ్మగోరు. బడిలో నుండి పారిపోయి వస్తుంటేను...." గిన్నెలు తోమిన చేతులు కడుగుకొని అంది రామాయమ్మ.

"గుర్రాన్ని నీళ్ళకాడికి తీసుకెళ్తాం కాని నీళ్ళు త్రాగించలేం కదండి."

నేను ఏమి అనలేదు. ఆ తర్వాత పిల్లని మా ఇంటికి తీసుకురాలేదు రామాయమ్మ.

"నాకెంత కష్టం వచ్చినాదే తల్లే...." రామాయమ్మ గుండెలు

బాదుకొని ఏడుస్తుంది.

"ఊరుకో, రామాయమ్మ ఊరుకో" నేను మెల్లిగా జరిగి రామాయమ్మ భుజంమీద చెయ్యివేసి అన్నాను.

"జరిగినదేదో జరిగిపోయింది ఊరుకో"

"ఎలా ఊరుకుంటాను తల్లే. నన్ను నట్టేటిలో ముంచినాదే తల్లే.... నా బాధ ఎవరికి చెప్పకోవాలో...."

ఏం మాట్లాడాలో తోచలేదు నాకు.

రామాయమ్మ వెనుకున్న కొడగట్టే దీపం వొత్తిని ఎగదోస్తున్నాడు రామాయమ్మ భర్త.

"బడికెళ్లినా బాగుండేది నా తల్లే.... నన్నిలా ముంచేస్తుందని అనుకోలేదు తల్లే...." రామాయమ్మ ఏడుస్తూనే వుంది.

రామాయమ్మ దుఃఖం నా మాటలకు తగ్గదని అనిపించింది నాకు. అక్కడ నుంచి బయలుదేరితే మంచిదని అనుకున్నాను.

"అలా ఏడిస్తే ఎలా రామాయమ్మ." నేను అన్నాను. "కడుపు కోత భరించడం కష్టమే. ఐనా ఓర్చుకోవాలి."

"నేనెలా ఓర్చుకుంటాను తల్లే. దాన్ని పనిలో పెట్టి తీసుకున్న రెండు వేలు నేనెలా తీర్చాలి తల్లే...."

నా బుర్ర తిరిగిపోయింది.

రామాయమ్మ ఏడుపు పిల్ల పోయినందుకన్నా పిల్లని పణంగా పెట్టి తీసుకున్న రెండు వేల రూపాయలు అప్పు గురించని తెలిసిన నేను అక్కడ నిలబడలేకపోయాను.

లోగుట్టు పెరుమాళ్ళ కెరుక!

కథా నిలయం
శ్రీకాకుళం